

మాట్లాడుతున్న మంత్రి భరత్

సమస్యలపై గళం విప్పేరా..?

- ఇప్పుడైనా సభ్యులు హాజరయ్యేరా..? - జిల్లాలో కోకొల్లలుగా సమస్యలు - నేడు జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/అగ్రికల్చర్

ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. గత ప్రభుత్వంలో సభ్యులు సక్రమంగా హాజరయ్యే పరిస్థితి లేదు. జిల్లాలో అనేక సమస్యలు తిష్ట వేశాయి. ఇప్పుడైనా సభ్యులు హాజరై ప్రజా సమస్యలపై గళం విప్పుతారా అనే సందేహాలు నెలకొన్నాయి...

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని జడ్పిటిసిలు, ఎంపిపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, మంత్రులు ఇలా ప్రతి ఒక్క ప్రజాప్రతినిధులు పాల్గొని చర్చించాల్సిన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ ఎరబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటు తరువాత జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశాల్లో సభ్యులు అందరూ అధికార పార్టీ వారు ఉండటం ప్రతిపక్షం లేకపోవడం వల్ల తూతూ మంత్రాంగానే సర్వ సభ్య సమావేశాలు జరిగేవి. పూర్తి స్థాయిలో ఎప్పుడు కూడా ప్రజాప్రతినిధులు హాజరుకాని పరిస్థితి ఉండేది. ఉమ్మడి జిల్లా అభివృద్ధి, ప్రజల సమస్యల ప్రస్తావనకు వేదికగా ఉండే సమావేశానికి కనీసం బాధ్యత లేకుండా హాజరు కాకుండా ప్రజాప్రతినిధులు వ్యవహరించేవారు. అలాంటి ఈ సమావేశానికి ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో హాజరు అవుతారా? ప్రజా సమస్యలపై గళం విప్పుతారా ? వాటి పరిష్కారం చేసేలా చర్యలు తీసుకుంటారా? అనే సందేహాలు జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం 52 మంది వైసిపి జడ్పిటిసిలు, 12 మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు, 2 వైసిపి ఎమ్మెల్యేలు, ఇద్దరు టిడిపి ఎంపిలు, ఉమ్మడి జిల్లాలో 3 మంత్రులు ఉన్నారు. వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, నీటిపారుదలశాఖ, విద్యుత్ శాఖపై చర్చించనున్నారు. ఉమ్మడి జిల్లా అన్ని శాఖల అధికారులు హాజరు కానున్నారు. వాస్తవంగా ప్రజా సమస్యలపై చర్చించి చర్యలు తీసుకుంటే జిల్లా అభివృద్ధి జరుగుతుంది. రాజకీయంగా వ్యక్తిగత సమస్యలపై చర్చిస్తే ప్రజా సమస్యలు గాలికి వదిలేసినట్టే అవుతుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

తప్పని వలస వెతలు

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హొళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. కోసిగి మండలంలో అత్యధికంగా 6వేల కుటుంబాలు వలస బాట పట్టాయి. ఉపాధి పనుల్లో సరైన కూలి దక్కకపోవడంతోనే వలస వెళ్తున్నట్లు వలసదారులు చెబుతున్నారు.

ఉత్తిపోతలుగానే ఎత్తిపోతలు

కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసళ్లి, సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి.

సమస్యలకు నిలయంగా జిల్లా కేంద్రం

కర్నూలు జిల్లా కేంద్రం పలు సమస్యలకు నిలయంగా మారింది. శివారు కాలనీలకు తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. కల్లూరుతో పాటు నూతనంగా నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చి చేరిన గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో కూడా రెండు, మూడు రోజులకు ఒక సారి నీటిని వదులుతున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. వర్షాలు వస్తే మురుగు నీరు నేలపై పారుతున్నాయి.

సాగు, తాగు నీటికి తిప్పలే



ఆలూరు నియోజకవర్గంలో తాగు నీటి కోసం ఎల్ఎల్సి, హెచ్ఎల్సి నుండి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందుతుంది. వర్షాకాలంలో వారానికి ఒకసారి, వేసవిలో 15 రోజుల నుండి 20 రోజులకు నీరు అందిస్తారు. నీటి సమస్య పరిష్కారానికి వామపక్షాల పోరాటంతో చిప్పగిరి మండలంలో 2008లో నగరడోన రిజర్వాయర్‌కు వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసి వదిలేశారు.

సాగని జొలదరాసి, తెలుగు గంగ లైనింగ్ పనులు

కోవెలకుంట్ల మండలం జొలదరాసి పైలెట్ ప్రాజెక్టుకు 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సంవత్సరంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భూమి పూజ చేసినా ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. భూసేకరణ కూడా జరగలేదు. ఆళ్లగడ్డ, శిరివెళ్ల, చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో తెలుగు గంగ లైనింగ్ పనులు ముందుకు సాగడం లేదు. ప్రతిసారీ పాలకులు చెబుతున్న హామీలు మాటలకే పరిమితం అవుతున్నాయి. ఆళ్లగడ్డ మండలం ఈ.జంబులదిన్నె సమీపంలోని వక్కిలేరు వాగుపై వంతెన నిర్మాణానికి రూ.5.60 కోట్లు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఆ గ్రామం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైవేకు రావాలంటే 8 కిలోమీటర్ల దూరం తిరిగి రావాల్సి వస్తోంది.

పారిశుధ్యం అధ్వాన్నం..రోడ్లు గుంతలమయం

మహానంది మండలంలో ముఖ్యంగా పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. గుంతలమయమైన రహదారుల సమస్య, తాగునీటి సమస్య, మండలంలో వాగులపై బ్రిడ్జి నిర్మాణం సమస్యలు మండలాన్ని వెంటాడుతున్నాయి. గ్రామాల్లో చెత్త వేసేందుకు డంపింగ్ యార్డులు లేక పోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఎన్నో సంవత్సరాలుగా ఈ సమస్యలు ఉన్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు.

నిర్మాణానికి నోచని శివపురం వంతెన

కొత్తపల్లి మండలంలో శివపురం వంతెన నిర్మాణం సాగడం లేదు. సంవత్సరాలు గడుస్తున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. వర్షాలు వస్తే ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో చినుకు పడితే రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా ఉండటంతో నీరు ఉన్నా రైతుల పొలాలకు సాగునీరు అందడం లేదు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- అభివృద్ధి పనుల భూమిపూజలో మంత్రి టిజి.భరత్
- రూ.2 కోట్లకు సంబంధించి తొలి శంకుస్థాపనల్లో మంత్రి, ఎంపీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ తెలిపారు. గురువారం 23వ వార్డు శ్రీరామ్ నగర్‌లో రూ.20 లక్షలతో సిసి డ్రెయినేజీ కాలువలు, రూ.39 లక్షలతో సిసి రోడ్లు, 17వ వార్డు చాణక్యపురి కాలనీలో రూ.70 లక్షలతో కమ్యూనిటీ హాలు, 15వ వార్డు బుధవారపేట శ్మశాన వాటికలో రూ.70 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. మొత్తం దాదాపు రూ.2 కోట్ల నిధులకు సంబంధించి మంత్రి, ఎంపీ తొలిసారి అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. నగరమంతా మౌలిక సదుపాయాల కల్పన పక్క ప్రణాళికతో ముందుకెళ్తామని తెలిపారు. కమీషన్లు తీసుకునే అలవాటు, పనుల నాణ్యతలో రాజీ పడే అలవాటు తమకు లేదన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతతో అభివృద్ధి పనులు చేస్తే చాలు తమకు అదే సంతోషమని తెలిపారు. నాణ్యత లోపిస్తే తదుపరి పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రజా సమస్యలను దశలవారీగా పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని తెలిపారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ... నగరంలో అభివృద్ధికి కృషి చేస్తానని, గతంలో అభివృద్ధి శూన్యమని తెలిపారు. మంత్రితో కలిసి నగరాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, నగరాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తామని చెప్పారు. డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు కైప పద్మాలత, పల్లవి, శివమ్మ, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎంఇలు షాకీర్, శేషసాయి, ఎఇ జనార్ధన్, భాను పాల్గొన్నారు.

ఆర్‌యు ఇన్‌ఛార్జీ విసిగా ఎన్‌టికె.నాయక్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ విశ్వవిద్యాలయం ఇంఛార్జి వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ ఎన్‌టికె నాయక్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరబ్ గౌర్ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం వర్సిటీ రెక్టార్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. గతంలో రిజిస్ట్రార్‌గా కూడా విధులను నిర్వహించడమే కాకుండా వర్సిటీలో అనేక కీలక పోస్టులలో పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. వర్సిటీలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎన్‌టికె.నాయక్

ఉర్దూ వర్సిటీ ఇంఛార్జి విసిగా షేక్షావలి ఖాన్

డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇంఛార్జి వైస్ ఛాన్సలర్‌గా పఠాన్ షేక్షావలి ఖాన్‌ను నియమించారు. ఆయన ప్రస్తుతం యోగివేమన విశ్వవిద్యాలయంలో బాటిని డిపార్ట్మెంట్లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. యూవర్సిటీల్లో గత ప్రభుత్వ హయాంలో వైస్ ఛాన్సలర్లుగా ఉన్న వారు రాజీనామాలు చేయడంతో ప్రభుత్వం యూనివర్సిటీలను ఇంఛార్జి విసిలను నియమించింది.

స్త్రీ జనోద్ధరణకు లక్ష్మమ్మ జీవితం అంకితం

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

టిసి.లక్ష్మమ్మ స్త్రీ జనోద్ధరణకు జీవితాన్ని అంకితం చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి తెలిపారు. గురువారం సుందరయ్య భవన్‌లో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మమ్మ



మాట్లాడుతున్న గౌస్‌దేశాయి

9వ వర్ధంతి సభ జిల్లా అధ్యక్షులు అరుణమ్మ అధ్యక్షతన జరిగింది. ముందుగా టిపి.లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయి మాట్లాడారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం లక్ష్మమ్మ నిరంతరం పోరాడారని తెలిపారు. సిపిఎంకు నరసింహయ్య, ఐద్వాకు టిసి.లక్ష్మమ్మ తమ జీవితాలను త్యాగం చేసి ఆదర్శ దంపతులుగా మెలిగారని చెప్పారు. ఆమె తమ ప్రాంతంలో మహిళలకు చదువు నేర్పేవారని, టైలరింగ్ ద్వారా తన కుటుంబాన్ని పోషించుకున్నారని తెలిపారు. వారి కుమారులను కూడా పార్టీ వైపు నడిపించి, తమ బాటలో నడిచే విధంగా చేశారన్నారు. భూ ఉద్యమంలో కానీ, సారా ఉద్యమాల్లో కూడా ఆమె జోలె కట్టి ఉద్యమాలను నడిపారని తెలిపారు. ఉద్యమాల్లో ఎవరైనా జైలుకు వెళితే వెన్ను తట్టి ధైర్యం చెప్పేవారని చెప్పారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు రక్షణ లేదని, అందుకు ఈ వ్యవస్థ కారణమని అన్నారు. సమాజ మార్పు కోసం పనిచేయడమే లక్ష్మమ్మకు ఇచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ... చదువుకున్న స్త్రీ సమాజంలో ఉన్నప్పుడే సమాజం మార్పు జరుగుతుందని, అందుకే అమ్మాయిలను చదివించాలని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్.అలివేలు మాట్లాడుతూ... నిర్బంధంలో కూడా లక్ష్మమ్మ మహిళల కోసం పని చేశారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో చిన్నపిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు అత్యాచారాలకు, హత్యలకు గురవుతున్నారని చెప్పారు. మహిళలు టివి సీరియళ్లకు అతుక్కుపోకుండా మహిళలను చైతన్యవంతులను చేసి, పిల్లలను సన్మార్గంలో నడిచే విధంగా తయారు చేయాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ మాట్లాడుతూ... డ్రగ్స్, అశ్లీలత అంతం.. పంథంగా మార్చుకొని ముందుకు వెళ్లాలని చెప్పారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, సిపిఎం న్యూసిటీ, ఓల్డ్ సిటీ కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు, వ్యకాస జిల్లా నాయకులు వెంకటరాముడు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు కెఎస్.పద్మ, జిల్లా కోశాధికారి పిఎస్.సుజాత, జిల్లా నాయకులు లక్ష్మీదేవి, నోమేశ్వరి, జయమ్మ, నగర నాయకులు సావిత్రి, అమీనా, లక్ష్మి, కుమారి, పర్వీన పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్ : కర్నూలు జిల్లా మహిళా ఉద్యమ నేత టిసి.లక్ష్మమ్మ ఆశయాలను కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి కోరారు. ముజఫర్ నగర్ టిసి.లక్ష్మమ్మ కుట్టు శిక్షణ కేంద్రంలో లక్ష్మమ్మ వర్ధంతి సభ జి.ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. లక్ష్మమ్మ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, ఐద్వా జిల్లా అధ్యక్షులు జి.ధనలక్ష్మి, సభ్యులు జె.లక్ష్మి భాయి, కె.దానమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం నాయకులు ఎం.శ్రావణ్ కుమార్, ఎస్.బషీర్ అహ్మద్, ఐద్వా నాయకులు ఎస్.శారదమ్మ, సాలమ్మ, ఈశ్వరమ్మ, రమణమ్మ, కన్యక, శివలీల, కె.కుమారి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వ హామీలు అమలు చేసేలా చూడాలి

- ఎంపీకి అఖిలపక్ష రైతుసంఘాల వినతి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేలా కృషి చేయాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కోరారు. గురువారం పంచలింగాలలోని ఎంపీ స్వగృహంలో ఆల్ ఇండియా కిసాన్ సంయుక్త మోర్చా ఇచ్చిన పిలుపుమేరకు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు అఖిలపక్ష రైతుసంఘాల నాయకులు కె.జగన్నాథం, జి.రామకృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2021లో రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని, ఎంపీగా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. 2013 భూసేకరణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతేడాది పెరిగే భూముల ధరలకు అనుగుణంగా రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఎరువులు, పురుగు మందుల ధరలను అదుపు చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పార్లమెంటు దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ నాగరాజు హామీ ఇచ్చారు. రైతు స్వరాజ్య వేదిక నాయకులు పోతుల శేఖర్, న్యూ డెమోక్రసీ నాయకులు వెంకటేశ్వర్లు, ఎపి రైతుసంఘం నాయకులు శ్రీనివాసులు, తాండ్రపాడు సర్పంచి బాలపీరా, ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు జి.ఆంజనేయులు, పంచలింగాల మాజీ సర్పంచి బి.వెంకటేశ్వర్లు, పంచలింగాల సర్పంచి జి.కృష్ణ, నాయకులు ఖాదర్, హరీష్, తాండ్రపాడు హమీద్ పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



నాగేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా డ్రైవర్స్ కాన్ఫెడరేషన్ సౌత్ జోన్ అధ్యక్షుడు వై నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిక్కిం రాష్ట్రంలోని గాంగ్ టాక్ ప్రాంతంలో ఆల్ ఇండియా డ్రైవర్స్ కాన్ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిక్కిం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్, ఆల్ ఇండియా డ్రైవర్స్ కాన్ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు సందీప్ మౌర్యతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, సౌత్ ఇండియా జోన్ అధ్యక్షులు, కర్నూలు జిల్లా అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పాపారావుతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి మక్బూల్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో అనేక డ్రైవర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అద్దె వాహనాలను తీసివేసి కొత్త వాహనాలను కొనుగోలు చేయాలన్నారు. డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన కోరారు. సిక్కిం రాష్ట్ర అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా వై నాగేశ్వరరావును రాష్ట్ర ముఖ్యమంత్రి ఘనంగా సత్కరించారు.

నెలాఖరులోగా గ్రామాలను సందర్శించాలి

- సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు
- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను పూర్తిస్థాయిలో అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులోగా గ్రామాలన్నింటినీ అధికారులు సందర్శించి పారిశుధ్యం, తాగునీటిపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం అయినందున గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పూర్తి స్థాయిలో అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్యం, నీటి కలుషితం వల్ల అంటువ్యాధులు వ్యాప్తి చెందకూడదని, ఒక్క మరణం కూడా సంభవించకూడదని అధికారులను హెచ్చరించారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. డయేరియాకి సంబంధించి స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించినప్పటికీ కూడా 1 లేదా 2 గ్రామాల్లో డయేరియా వల్ల బాధపడుతున్నారని, ఇకపై ఇలాంటి పరిస్థితి రాకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి వారంలో 4 గ్రామాలను సందర్శించాలన్నారు. ప్రతి గ్రామంలో 15 రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంక్ శుభ్రం చేయించాలన్నారు. సోర్సెస్‌తో పాటు చివరి గ్రామం వరకు క్లోరినేషన్ టెస్ట్‌ను సక్రమంగా చేయాలన్నారు. మొత్తం పైప్ లైన్‌ను చెక్ చేసి, లీకేజి లేకుండా చేయాలన్నారు. మురికి నీరు, తాగునీరు కలిసే చోట చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో చెత్త కుప్పలను వెంటనే తీసివేయించడంతో పాటు, డ్రెయిన్స్ అన్నీ క్లీన్ చేయించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఫాగింగ్ యధావిధిగా కొనసాగించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, హాస్పిటల్, రైతు సేవ కేంద్రాన్ని కూడా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆలూరులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి అంశంపై ప్రత్యేకాధికారులు, ఎంపిడిఓలు శుక్రవారం సమీక్ష నిర్వహించుకుని నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు పని దినాలు కల్పించే అంశంలో పురోగతి సాధించాలన్నారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డిఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభమైందని జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింతా సురేష్ బాబు తెలిపారు. గురువారం స్థానిక బిర్లా కాంపౌండ్ జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రియాశీలక సభ్యత్వం భావోద్వేగంతో కూడుకున్నదని తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న పోరాటంలో భాగమయ్యేందుకు ప్రతి జనసైనికుడు ముందుకు రావాలన్నారు. 4వ విడత క్రియాశీలక సభ్యత్వం ఈనెల 18 నుంచి 28 వరకు జరగనుందని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ సభ్యత్వ నమోదు చేసుకొని బీమా సదుపాయం పొందాలని కోరారు. క్రియాశీలక సభ్యత్వం పొందిన వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నియోజకవర్గానికి 50 మంది వాలంటీర్లను నియమించామని, సభ్యత్వం పొందాలనుకున్న జనసైనికుడు వారిని సంప్రదించాలని కోరారు. అనంతరం జనసేన వాలంటీర్ల ఫోన్‌లో వారి చేతుల మీదుగా సభ్యత్వ నమోదును ప్రారంభించారు. నాయకులు పిబివి.సుబ్బయ్య, మంజునాథ్, బజారి, సుధాకర్, సుమలత, సతీష్, షబ్బీర్ పాల్గొన్నారు. అలాగే కర్నూలు అసెంబ్లీలో ధర్నా చౌక్‌లో జనసేన నాయకులు హర్షద్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును కేక్ కట్ చేసి ప్రారంభించారు. జనసేన నాయకులు నాగరాజు, శేఖర్, హరిబాబు పాల్గొన్నారు. అలాగే వెంకటరమణ కాలనీలో సభ్యత్వ నమోదును జనసేన ఎన్నికల జోనల్ కన్వీనర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన జిల్లా నాయకులు అనితశ్రీ, నాయకులు రామ్మోహన్, కరుణాకర్, జీవన్, రాజేష్, హరి, సాయి, మాలిక్, పరశురాం, రమేష్, సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు



నమోదును చూపుతున్న నాయకులు

జిజిహెచ్‌లో మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్



కర్నూలు ప్రభుత్వ స్పత్రిలో ఎంఎస్ 5 వార్డులో మరుగుదొడ్ల సమస్యపై సిపిఎం నాయకులు వార్డును పరిశీలించిన వెంటనే అధికారులు స్పందించి మరుగుదొడ్డి శుభ్రం చేసి తలుపులు ఏర్పాటు చేశారు. ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలపై జిజిహెచ్ అధికారులు స్పందించి మరుగుదొడ్లకు తలుపు లు ఏర్పాటు చేయడం పట్ల సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు జి.ఏసు ధన్యవాదములు తెలిపారు.

రహదారికిరువైపులా పిచ్చి మొక్కలు, కంపలు తొలగింపు

ప్రజాశక్తి-క్రిష్ణగిరి

క్రిష్ణగిరి పంచాయతీ రామకృష్ణాపురం గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ దామోదర్ నాయుడు ఆధ్వర్యంలో రహదారికి ఇరువైపులా రహదారి మూసుకుపోవడంతో వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందికరంగా ఉండడంతో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు తొలగించారు. గ్రామస్తులు రాకపోకల అవసరాల రీత్యా గ్రామ సర్పంచ్ జెసిబి సహాయంతో పనులు చేయించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురం గ్రామ ప్రజలు సర్పంచికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి చంద్ర, చక్రపాణి నాయుడు, బాలప్ప నాయుడు, వెంకటేష్, శివ పాల్గొన్నారు.

రైతులకు ఆర్థికసాయం వెంటనే ఇవ్వాలి

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రైతులకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేల ఆర్థిక సహాయం వెంటనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామ సచివాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2023లో ఖరీఫ్ సీజన్‌లో రాయలసీమ, ఉత్తరాంధ్ర, నెల్లూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్ర కరువు నెలకొందని తెలిపారు. సుమారు 350 మండలాల్లో 25 లక్షల ఎకరాల్లో ఎలాంటి విత్తనాలూ పడలేదని చెప్పారు. పంటలు వేసినా సుమారు 30 లక్షల ఎకరాల్లో కరువు కారణంగా పంటలు దెబ్బతిని దిగుబడి రాక రైతులు, కౌలు రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన రెండేళ్లలో జూన్, జులై మాసంలో పంట బీమా పరిహారాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేసిందని తెలిపారు. 2023 ఖరీఫ్‌కు సంబంధించిన కరువు, తుఫానుతో నష్టపోయిన రైతులకు పంట బీమా పరిహారం ఈఏడాది ఇప్పటివరకు జమ చేయలేదని చెప్పారు. వెంటనే 2023 సంవత్సర పంటల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మోటార్లకు మీటర్లు పెట్టే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతు ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం గ్రామ సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, రైతుసంఘం గ్రామ నాయకులు వెంకటయ్య, బడేసాహెబ్, నాగన్న, శివన్న, లోకన్న, కృష్ణ, మద్దిలేటి, ఈశ్వరయ్య, సుభాన్, సాహెబ్, డివైఎఫ్ఐ నాయకులు ప్రకాష్, కిషన్, అంజి, రాము, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

కర్నూలు కలెక్టరేట్ : రైతులకు పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, రైతుసంఘం మండల సహాయ కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. ఓర్వకల్ మండలంలోని నన్నూరు గ్రామ సచివాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారిని అనితకు వినతి పత్రం అందజేశారు. మల్లేష్, మాసుం బాష, దస్తగిరి, బుజ్జన్న, రైతులు, శివ రాముడు, దేవరాజు, రమేష్, షేక్షా పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాస రావును గురువారం జిల్లా కోర్టులో ఎస్పీ జి. బిందు మాధవ్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. పెండింగ్ కేసులను తగ్గించడానికి, లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా న్యాయశాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేసి బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయడంపై చర్చించారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించేలా, పోలీసు శాఖ తరఫున కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.

స్వచ్ఛత ఎమ్మిగనూరు లక్ష్యం

- మానవ మనుగడకు అతి ముఖ్యమైనవి మొక్కలే : ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

స్వచ్ఛత ఎమ్మిగనూరు సాధనే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని మైనారిటీ కాలనీలో నిర్వహించిన మెగా ప్లాంటేషన్ డ్రైవ్-2024లో ఎమ్మెల్యే బీవీ పాల్గొని మొక్కలు నాటారు. పది వేల మొక్కలు నాటి ఎమ్మిగనూరు పచ్చదనం పరిశుభ్రతకు నిలయంగా మార్చాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానవ మనుగడకు అతి ముఖ్యమైనవి మొక్కలే అని, అసలు మొక్కలు లేకుంటే మనిషే లేడని తెలిపారు. మనిషి జీవించాలంటే ఆక్సిజన్ తప్పనిసరి అని, ఈ ఆక్సిజన్ మొక్కల ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ పరిసరాల్లో మొక్కలు పెంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, సిబ్బంది, టిడిపి మైనార్టీ నాయకులు తురేకల్ నజీర్ అహ్మద్, స్థానికులు కలిసి 10,000 మొక్కలు నాటారు.

కౌలురైతులు గుర్తింపు పత్రాలు పొందాలి

- ఆదోని వ్యవసాయ సహాయ సంచాలకులు అరుణకుమారి

ప్రజాశక్తి - పెద్దకడబూరు


రైతులతో మాట్లాడుతున్న అరుణకుమారి

కౌలు రైతులందరూ ప్రభుత్వం అందించే కౌలు రైతు గుర్తింపు పత్రాలు పొంది ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించాలని ఆదోని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.అరుణ కుమారి తెలిపారు. గురువారం మండలంలోని నౌలెకల్‌లో రైతు సేవా కేంద్రంలో ఎఒ ఎం.వర ప్రసాద్ ఆధ్వర్యంలో కౌలు రైతులకు ప్రభుత్వం అందించే కౌలు ధ్రువీకరణ పత్రం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భూ యజమాని తన పొలం సాగు చేసుకోనప్పుడు కౌలుదారులకు కౌలు పత్రం పొందటానికి అవసరమయ్యే అంగీకార పత్రంపై సంతకం చేయాలన్నారు. దీని వల్ల భూ యజమాని ఎలాంటి హక్కులూ కోల్పోడని తెలిపారు. కౌలు పత్రం పొందిన కౌలు రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే పథకాలు వర్తిస్తాయని, పంటనష్టం, ఇన్స్యూరెన్స్ తదితర ప్రభుత్వ పథకాలు పొందవచ్చని చెప్పారు. నౌలేకల్ విఆర్‌ఒ నారాయణ రెడ్డి, వ్యవసాయ సిబ్బంది జి.బజారి, గ్రామ రైతులు పాల్గొన్నారు. అనంతరం ఆమె తారాపురం గ్రామ రైతులు పండించే నూతన వేరుశనగ రకం (వశిష్ఠ) రైతుక్షేత్రాలను సందర్శించి రైతులకు జిప్సమ్ వాడకం గురించి అవగాహన కల్పించారు. అనంతరం రైతు సేవా కేంద్ర పరిధిలో నిల్వ ఉంచిన ఎరువులను పరిశీలించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి : స్కావెంజర్స్

ఒప్రజాశక్తి - ఆలూరు

కొన్నేళ్లుగా పని చేస్తున్న స్కావెంజర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్కావేంజర్లు కోరారు. గురువారం ఆలూరుకు వచ్చిన జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్కావెంజర్స్ రంగమ్మ, ఆదిలక్ష్మి, సక్కుబాయి మాట్లాడారు. కొన్నేళ్ల నుంచి పాఠశాలలో తరగతి గదులు, బాత్ రూములు, టాయిలెట్‌లు శుభ్రపరుస్తూ తక్కువ వేతనంతో బతుకుతున్నామని తెలిపారు. ఇప్పుడు వేతనాలు పెంచడంతో కొందరు రాజకీయ వేధింపులకు పాల్పడి తొలగించేందుకు కుట్రపన్నుతున్నారని తెలిపారు. వేధింపులను ఆపి ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. వెంకప్ప స్పందిస్తూ... చిరు ఉద్యోగులను వేధింపులకు గురి చేయడం జనసేన పార్టీగా వ్యతిరేకిస్తున్నామని, సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. త్వరలోనే ప్రతి మండల కేంద్రంలో జనవాణి కార్యక్రమం చేపడతామని చెప్పారు. స్కావెంజర్స్ రాధమ్మ, లక్ష్మి, ఈరమ్మ, శాంతి, సునీత, రాధమ్మ, రూప, నాగమ్మ, లావణ్య పాల్గొన్నారు.

పదో తరగతి మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కీర్తిశేషులు పద్మశ్రీ మాచాని సోమప్ప ట్రస్ట్ సభ్యులు తార్కికేష్, రఘునాథ్ పదో తరగతి విద్యార్థులకు ఉచిత మెటీరియల్‌ను అందజేశారు. వారు అందజేసిన స్టడీ మెటీరియల్‌ను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం 35 మంది పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ మెటీరియల్‌ను ఉపయోగించుకొని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. పుస్తకాలను అందజేసిన ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు చెప్పారు. ఉపాధ్యాయులు గుమ్మల బాబు, అబ్దుల్ సలీం, ఉస్మాన్, మహబూబ్ బాషా, రంగస్వామి, అమానుల్లా బేగ్ పాల్గొన్నారు.


మెటీరియల్ పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు

వేడి చేసి చల్లార్చిన నీటిని తాగండి

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


గ్రామాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని సుంకేశ్వరి గ్రామాన్ని వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో అతిసార వ్యాధితో చిన్నారి జ్యోతి(4) మృతి చెందడం బాధాకరమన్నారు. మరో ఇద్దరు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో, ఆదోని, ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారని తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే పర్యటించాల్సి ఉండగా పెద్దభూంపల్లి గ్రామానికి చెందిన ఎంపిటిసి నాగలక్ష్మన్న అక్కయ్య అయిన చిన్నభూంపల్లి జొల్లయ్య అనారోగ్యంతో మరణించడంతో అక్కడకు వెళ్ళాల్సి వచ్చిందని చెప్పారు. ఎప్పటికప్పుడు అధికారులతో, సర్పంచి ముక్కరన్న, మాజీ ఎంపిటిసి రఘునాథ్ రెడ్డిని అడిగి తెలుసుకోవడంతో పాటు తగిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కలుషిత నీరు తాగి అతిసార వ్యాధి సోకిందని కొందరు టిడిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. గత 25 ఏళ్లుగా అవే నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారని, ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని తెలిపారు. నీటి పరీక్ష చేసిన అధికారులకు కూడా నెగిటివ్ రిపోర్ట్ వచ్చినట్లు తనకు చెప్పారని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల వల్ల ఇలాంటి జబ్బులు వచ్చి ఉంటాయని తెలిపారు. జ్యోతి కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం కింద రూ.5వేల నగదును సర్పంచి ముక్కరన్న చేతుల మీదుగా అందించారు. అంతకుముందు గ్రామంలోని సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులతో అతిసార వ్యాధి నివారణకు తీసుకున్న చర్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామ శివారులో ఉన్న తాగునీటి బోరును పరిశీలించి, గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ఏమైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యాధికారులకు తెలపాలని పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు. అతిసార వ్యాప్తి చెందకుండా జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎంపిడిఒ మునెప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాసులు రెడ్డి, ఎఇ వేద స్వరూప, వైద్యాధికారులు సురేష్, వసంత కుమారి, చిరంజీవి, సర్పంచి ముక్కరన్న, విఆర్‌ఒ ఆనందం సకాలంలో స్పందించి ప్రజలకు అవసరమైన సేవలు అందించడం అభినందనీయమన్నారు. గతంలోనే సుంకేశ్వరి గ్రామంతో పాటు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో ఆర్ఒ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు, మండలస్థాయి అధికారులు నివేదికలు పంపితే మరోసారి కలెక్టర్‌తో చర్చించి ఆర్ఒ ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తానని హామీఇచ్చారు. నోడల్ అధికారి బాలమురళీ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, డిఎల్‌పిఒ నూర్జహాన్ బేగం, వైసిపి నాయకులు రోగప్ప పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజలకు భద్రత కరువు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో సామాన్యులతో పాటు ప్రజాప్రతినిధులకు కూడా భద్రత కరువైందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలోని ఆయన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. ముచ్చుమర్రిలో చిన్నారిని అత్యాచారం చేసి చెరువులో వేశామని చెప్పినా అమ్మాయి మృతదేహం ఇప్పటికీ దొరకకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాడులకు పాల్పడుతోందని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో ఏ చిన్న పాటి ఘర్షణ జరిగినా నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై టిడిపి నాయకులు విమర్శలు చేసేవారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలుసని, ఇలాంటి వాటిని ప్రోత్సహించే వ్యక్తి చంద్రబాబు కాదని తెలుసన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధి వైపు దృష్టి సారించి, అభివృద్ధిలో పోటీ పడాలని తెలిపారు. శవైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, నాయకులు రోగప్ప పాల్గొన్నారు.



ఎస్టీ రిజర్వేషన్ సాధనే లక్ష్యం

- వాల్మీక రిజర్వేషన్ సాధన సమితి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎస్టీ రిజర్వేషన్ సాధించడమే తమ లక్ష్యమని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అరేకల్లు నాగరాజు, దేవేంద్ర తెలిపారు. గురువారం వారు వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి నూతన కమిటీలో మండల నాయకులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బోయలను ఎస్టీలోకి చేర్చేంత వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. గ్రామ, మండల, తాలూకా స్థాయిలో వాల్మీకులను ఒకేతాటిపై తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. గ్రామ, జిల్లాస్థాయిలో పోరాటాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ప్రతి వాల్మీకి నడుం బిగించి ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర నాయకత్వం తమ మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమని, గ్రామ స్థాయి నుంచి ఎస్టీ రిజర్వేషన్ కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

- జిల్లా అదనపు న్యాయమూర్తి సుధా

ప్రజాశక్తి - ఆదోని

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి అని జిల్లా అదనపు న్యాయమూర్తి పిజె.సుధా తెలిపారు. గురువారం ఆదోని మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ కోర్టు ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నేటి యువత బైక్‌లపై మోజుతో హెల్మెట్ వాడకుండా ప్రమాదాలు జరిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని చెప్పారు. పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

'రాష్ట్రంలో పెరిగిపోతున్న అత్యాచారాలు'

ప్రజాశక్తి - ఆలూరు

రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని, వాటిని నియంత్రించడంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత విఫలమయ్యారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి విమర్శించారు. గురువారం ఆలూరు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పగిడ్యాల మండలంలో చిన్నారిపై అత్యాచారం, హత్య జరిగిన ఇంతవరకు బాధితులను మంత్రి వంగలపూడి అనిత ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. పది రోజులు గడిచినా ఇంత వరకు బాలిక మృతదేహాన్ని కనుగొనలేకపోయారని విమర్శించారు. సిఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయడం బాగానే ఉన్నా హోం మంత్రి కూడా బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకులు అరికెర వెంకటేశ్వర్లు, వీరేష్, భాస్కర్, మాదన్న, హరి, మరకట్టు ఎల్లప్ప, పత్తికొండ రాజు, వరుణ్, నాగేంద్ర పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో ఉన్న విద్యార్థులు వలసలు పోకుండా చదువుకోవాలంటే గోనెగండ్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలుర సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్, గోనెగండ్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు పవన్, రంగస్వామి కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలో 28 గ్రామాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ లేకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఉన్న విద్యార్థుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. పశ్చిమ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజలు నిరంతరం దూరప్రాంతాలకు వలసలు వెళ్తుంటారని, పిల్లలను సంక్షేమ హాస్టల్‌లో వదిలి వెళ్లాలని అనుకుంటారని తెలిపారు. సంక్షేమ హాస్టల్ లేకపోవడంతో తల్లిదండ్రులు చదువులను మాన్పించి వారితోపాటు వలసలకు తీసుకె ళ్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి మండలంలో సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేసి విద్యారంగ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వేణు, శివ పాల్గొన్నారు.

రాంజల చెరువును కాపాడుకుందాం

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

రాంజల చెరువును ఆదోని ప్రజలంతా కలిసి కాపాడుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. గురువారం రాంజల చెరువును అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించి నీటి నిల్వ శాతం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాంజల చెరువు నుంచి నిల్వ ఉన్న నీటిని బయటికి తోడే ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. ఇంకో నాలుగు రోజుల్లో కలుషితం అయ్యాయని భావించే నీరంతా బయటికి వెళ్లిపోతాయని చెప్పారు. అనంతరం ఇక్కడి వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలగించి టిబి డ్యామ్ ద్వారా ఎల్ఎల్‌సి కెనాల్‌కు విడుదల చేసిన నీటిని, వర్షపు నీటిని నింపుతామన్నారు. ఫిల్టర్ చేసి శుద్ధమైన నీటిని ప్రజలకు సరఫరా చేస్తామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా రాంజల చెరువులో చెత్తాచెదారం పేరుకుపోయిందని చెప్పారు. దీనివల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. అందులోని చెత్తాచెదారం బయట తీయడానికి అధికారుల కృషి చాలా ఉందని తెలిపారు. రాంజల చెరువులో నీరు నిల్వ ఉంచితే ఆదోని ప్రజలకు ఎన్నటికీ నీటి ఎద్దడి రాదని భరోసా ఇచ్చారు. చెరువు గట్టు దగ్గర కొందరు పూజల పేరుతో వ్యర్థాలు, చెత్తను వేయడం మానుకోవాలని కోరారు. వెనుక వైపు మసీదు నుంచి వేసే చెత్తను రాంజలలో వేయకూడదని తెలిపారు. ఎంఇ వెంకట చలపతి రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ కృపాకర్ పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళితులపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం డిమాండ్ చేశారు. దాడిలో గాయపడిన బాధితులను గురువారం ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోటేకల్ గ్రామంలో పీర్ల పండగ సందర్భంగా దళితులు 'సావుసోను' ఆడారని గ్రామంలోని బీసీలు దాడి చేయడం దారుణమని తెలిపారు. పీర్ల పండగలో దళితులను కొట్టడం, దుర్భాషలాడడం దారుణమని విమర్శించారు. అధికారులు స్పందించి నిందితులను అరెస్టు చేయాలని, లేకపోతే జిల్లావ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కెవిపిఎస్ నాయకులు సుమాల ఆంథోని, రాజు, గుండప్ప, అరుణ్ పాల్గొన్నారు.

చిప్పగిరి ఎంపిపి కారు ధ్వంసం

- పరిశీలించిన ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి-చిప్పగిరి

అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న చిప్పగిరి ఎంపిపి జూటూరు హేమలత కారును బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఎంపిపి హేమలత, ఆమె భర్త వైసిపి చిప్పగిరి మండల కన్వీనర్ జూటూరు మారయ్య గురువారం గుంతకల్లు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బుధవారం రాత్రి సమయంలో తాము ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి ముందు ఉన్న కారు పైకప్పు అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో కొట్టి ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఉదయం బయటికి వెళ్లడానికి కారు వద్దకు రాగా తమ కారు ధ్వంసమయినట్లు గుర్తించామన్నారు. తమ రాజకీయ ఎదుగుదలను ఓర్వలేని వారు కారును ధ్వంసం చేశారన్నారు.

పరిశీలించిన ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ధ్వంసమయిన కారును ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి గురువారం ఉదయం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపిపి హేమలత కారును ధ్వంసం చేసిన వ్యక్తులను పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. వైసిపి సీనియర్ నాయకులు, చిప్పగిరి మాజీ ఎంపిటిసి మల్లికార్జున, నాయకులు లోకనాథ్, నాగరాజు, నారాయణస్వామి పాల్గొన్నారు.


ఎంపిపి కారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

నవోదయ విద్యాలయ సమితి వారు 2024-25 విద్యా సంవత్సరానికి గాను బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ కె.చందిరన్ కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అర్హులైన అభ్యర్థులు వెబ్ సైట్ https://cbseitms.rcil.gov.in/nvs ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు 3వ, 4వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణత పొంది ఉండాలని చెప్పారు. 5వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ ఉండాలన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాంతం వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు జూన్ 1, 2012 నుంచి జులై 31, 2014 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు.

దరఖాస్తుకు చివరి తేదీ: 10-08-2023
ఎంపిక పరీక్ష తేదీ : 20-01-2024
పూర్తి వివరాలకు వెబ్‌సైట్:
https://cbseitms.rcil.gov.in/nvs

బాధిత కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని విజయనగర్ కాలనీలో విద్యుదాఘాతానికి గురై దగ్ధమైన పూరి గుడిసె బాధిత కుటుంబానికి టిడిపి నాయకులు చేయూతనందించారు. గురువారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు యువ నేత మారుతి నాయుడు నేతృత్వంలో బాధితుడు కాంతారావుకు రూ.10 వేల నగదు అందించారు. టిడిపి వార్డు ఇన్‌ఛార్జీ అమర్ ప్రకాష్, విజయనగర్ కాలనీ వాసులు, టిడిపి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

కాచి వడబోసిన నీటితో ఆరోగ్యం

- ఇఒఆర్‌డి సందీప్

ప్రజాశక్తి - సిబెళగల్

కాచి వడబోసిన నీటిని తాగడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఇఒఆర్‌డి సందీప్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులను, తాగునీటి పథకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డయేరియా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందాయని, వర్షాకాలంలో ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కాచి వడబోసిన నీటిని తాగడం ఆరోగ్యానికి మంచిదని సూచించారు.

బాలికను హత్య చేసిన నిందితులను శిక్షించాలి

- మానవతావాదుల జెఎసి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక వాసంతిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మిగనూరు మానవతావాదుల జెఎసి నాయకులు గణేష్, యాపిలయ్య, షబ్బీర్, రజాక్, రంగన్న, వీరేష్ యాదవ్, షబ్బీర్ డిమాండ్ చేశారు. గురువారం మానవతావాదుల జెఎసి ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రజాసంఘాలు, జర్నలిస్టు సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, బీఎస్పీ, వామపక్ష పార్టీలు, మైనార్టీ సంఘాలు, విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా బయల్దేరి సోమప్ప సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు శ్రీనివాసులు నాయుడు, కొండయ్య, దేవేంద్ర బాబు, పంపన్నగౌడ్, మహేంద్ర, రాముడు, రాజు, ఖాదర్, ఎర్రన్న, అనీఫ్ మాట్లాడారు. వాసంతి హత్య జరిగి 12 రోజులు కావస్తున్నా ఇంతవరకు ఆ చిన్నారి మృతదేహాన్ని కూడా కనిపెట్టలేకపోవడం శోచనీయమని తెలిపారు. వెంటనే చిన్నారి మృతదేహాన్ని కనిపెట్టి కుటుంబానికి అందజేయాలని కోరారు. ప్రభుత్వం బాలిక మృతిపై సమగ్ర విచారణ జరిపి నిందితులకు 'లై డిటెక్టర్' పరీక్షలు జరిపించి నిజాలను నిగ్గు తేల్చి నిందితులకు కఠిన శిక్ష విధించేలా చూడాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం, ఒక ఇల్లు వేరే ప్రాంతంలో ప్రభుత్వమే నిర్మించి సమాజంలో ఆ కుటుంబం గౌరవప్రదంగా జీవించేలా తగిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు రంగప్ప, రాముడు, రంగయ్య, నారాయణ, ఖాజా, దేవేంద్ర, కృష్ణ, సురేంద్ర, ఉదయ్, శేఖర్, రఘునాథ్, నల్లారెడ్డి, నాగరాజు, రాజీవ్, శాంతయ్య, ఈరన్న, రాజు పాల్గొన్నారు.


తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్న నాయకులు

పంట నష్టపరిహారం, బీమా చెల్లించాలి

- రైతుసంఘం, వ్యకాస నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, అలాగే కంపెనీల ద్వారా రావాల్సిన ఇన్స్యూరెన్స్ చెల్లించాలని రైతుసంఘం, వ్యకాస నాయకులు కోరారు. గురువారం రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యంలో మండలంలోని గనేకల్, హానవాల్ గ్రామ సచివాలయాల ఎదుట రైతులు, కూలీలు ఆందోళన చేపట్టారు. రైతు సంఘం మండల నాయకులు బాష, హనుమంతు రెడ్డి, వ్యకాస మండల నాయకులు గోవిందు, అబ్దుల్ రహీం నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. ప్రభుత్వం కొంతమందికి మాత్రమే పంట నష్టపరిహారం ఇచ్చిందని, మరికొంతమందికి నేటికీ నష్టపరిహారం ఇవ్వలేదని తెలిపారు. అనంతరం గనేకల్ గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్, హానవాల్ సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షులు రామాంజనేయులు, కృష్ణ, గోవిందరెడ్డి, రమేష్, కొండయ్య, వై.తాయన్న, తాయన్న, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి - ఆలూరు

జనసేన పార్టీ క్రియాశీలక 4వ విడత సభ్యత్వ నమోదు ప్రక్రియను నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప గురువారం ప్రారంభించారు. అంతకుముందు వై జంక్షన్ నుంచి భారీగా బైక్ ర్యాలీతో పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనసేన ఆవిర్భావం నుంచి 18 ఏళ్లు నిండిన జన సైనికులకు, వీర మహిళలకు పార్టీ సభ్యత్వం సంవత్సరానికి రూ.500 కడితే ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి రూ.5లక్షల బీమా, గాయాలయితే రూ.50 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. జన సైనికులు, రాష్ట్ర ప్రజల బాగోగులను చూసే వ్యక్తి పవన్ కల్యాణ్ అని చెప్పారు. గతంలో నియోజకవర్గంలో ఆస్పరి మండలం చిరుమాన్ దొడ్డి గ్రామంలో బలవర్ధన్, హాలహర్వి మండలం కామినహాల్ గ్రామంలో విజయకుమార్ ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా ప్రీమియం అందించినట్లు గుర్తుచేశారు. నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఇంటికీ ఎన్‌డిఎ మేనిఫెస్టోను అందించడంలో, గెలుపు కోసం క్రియాశీలకంగా పనిచేసిన జన సైనికులకు, వీర మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. జనసేన ఐటి కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, మండలాల కన్వీనర్లు ఛత్రపతి, అరవింద్, చంద్ర, అశోక్, బడేసాబ్, జగదీష్, చంటి పాల్గొన్నారు. **నందవరంలో** జనసేన మండల నాయకులు సి.ఎల్లప్ప జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు సభను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జనసేన ఇన్‌ఛార్జీ రేఖగౌడ్ హాజరయ్యారు. జనసేన మండల నాయకులు గడ్డం చంద్ర, బంగారి, అంజి, ఈరన్న, ఎం.బాష, మిన్నెల్లా పాల్గొన్నారు.


ఆలూరులో ఫోన్‌లో సభ్యత్వ నమోదును చూపిస్తున్న నాయకులు

'గుండమ్మ కుటుంబానికి రక్షణ కల్పించాలి'

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో హత్యకు గురైన మాదిగ గుండమ్మ కుటుంబానికి రక్షణ కల్పించాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం దళిత, ప్రజాసంఘాల కన్వీనర్ రామతీర్థం అమ్రేష్ మాదిగ ఆధ్వర్యంలో ఆదోనిలో నాగనాథనహళ్లి గ్రామస్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ముందుగా బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, సత్యం టాకీస్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ నాయకులు అమ్రేష్ మాదిగ, బీఎస్పీ రాష్ట్ర నాయకులు మంచాల లక్ష్మీనారాయణ, మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు నరసప్ప, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు హెబ్బటం రాజు, జై భీమ్ యువత మారెప్ప, బీఎస్పీ ఆలూరు ఇన్‌ఛార్జీ రామలింగ, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ జిల్లా మహిళా అధ్యక్షులు కదిరికోట బతుకమ్మ, సుమాల చార్లెస్, ప్రసన్న కుమార్ మాట్లాడారు. నాగనాథనహళ్లి గ్రామంలో మాదిగలు అభద్రత భావానికి లోనై భయాందోళనకు గురయ్యారని తెలిపారు. గ్రామంలోని మాదిగ కాలనీలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. నిందితులను జిల్లా బహిష్కరణ చేసి గుండమ్మ కొడుకు కిషోర్ ప్రాణాలను కాపాడాలని తెలిపారు. మాల మహానాడు నాయకులు సాయిరామ్, వివిధ దళిత, ప్రజా సంఘాల నాయకులు, నాగనాథనహళ్లి గ్రామ మాదిగలు రవికుమార్, కిషోర్, సుంకులమ్మ, శ్రుతి, ఎల్లమ్మ, మంగమ్మ, నరసమ్మ, సోమలింగమ్మ, షేకన్న, నరసింహులు, పెద్ద నరసింహులు, రామప్ప, నరసప్ప, కిరీటి, శివరాజు, ఎంఆర్‌పిఎస్ టౌన్ కన్వీనర్ మన్మోహన్ మాదిగ పాల్గొన్నారు.

రూ.40 లక్షల అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 41వ వార్డు సిఎండిఎఫ్ రూ.40 లక్షల నిధులతో అన్నా క్యాంటీన్ ఎదురుగా నూతన సిసి డ్రెయినేజీ నిర్మాణం, శిల్పా అపార్ట్‌మెంట్ నుంచి డిస్పోజల్ డ్రెయిన్ నిర్మాణ పనులు, కౌసల్య అపార్ట్‌మెంట్ నుంచి విష్ణు టౌన్‌షిప్ నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులు, కొత్త ఈద్గా సర్వీస్ రోడ్డు వరకు నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి భూమిపూజ చేశారు. నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షులు కె.పార్వతమ్మ, కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, వార్డు ఇన్‌ఛార్జీ నాగేశ్వర రావు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షులు జవ్వాజి గంగాధర్ గౌడ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, కురువ ధనుంజయ, కోట్ల తిమ్మారెడ్డి పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి